క్లుప్తంగా

ప్రజారోగ్య కార్యక్రమం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): నవాబుపేట సెక్టార్‌లోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రజారోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి తల్లులకు ఆధార్ నవచేతనశీల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, పిల్లలకు అందుతున్న పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన పగడాల వెంకటేశ్వర్లు మూడు ప్రెషర్ కుక్కర్లను అందజేశారు. పోషణ వాటికలో భాగంగా నలజాల కోటేశ్వరరావు ఇచ్చిన జామమొక్కను కేంద్రం ఆవరణలో నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థల కేటాయింపుపై హర్షం

వత్సవాయి: అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు కోసం రాజధాని అమరావతిలో స్థలం కేటాయించడం హర్షణీయమని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుండటం శుభపరిణామన్నారు. సమావేశంలో మహిళా విభాగం అధ్యక్షురాలు మోటమర్రి లక్ష్మి, వత్సవాయి మండల సంఘ అధ్యక్షులు గుర్రం హనుమంతురావు, గుర్రం కృష్ణమూర్తి, పల్లపోతుల నాగేశ్వరరావు, యర్రా శ్రీను పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారికి బుధవారం తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌కు చెందిన భక్తులు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం వారికి వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్ రమ, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్ఎస్ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు



నవాబుపేట(పెనుగంచిప్రోలు): జీఎస్ఎస్(గ్రేస్ సర్వీస్ సొసైటీ) ఆధ్వర్యంలో నవాబుపేటలోని బేతెస్థ ప్రార్థనా మందిరం వద్ద ఏర్పాటు చేసిన బోరు పంపును హెచ్ఎం శెట్టిపోగు రాము, సంస్థ నిర్వాహకులు జాన్, పాస్టర్ పి.పాల్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దైద వినోద్‌కుమార్, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు ఎంపిక



నందిగామ రూరల్: స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాకతీయ విద్యార్థులు ఎంపికకావడం అభినందనీయమని ఆ విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కీర్తన, లిఖిత్, వినయ్‌లను స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం ఆయన అభినందించారు. ఈసందర్భంగా కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటి బహుమతులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్, కాపా భారతి, కార్తికేయ, స్ఫూర్తి, సుష్మ, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపకుడి పోస్టుకు అతిథి అధ్యాపక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.రూన్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ గణితంలో 50 శాతం మార్కుల పైబడి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోపు నిర్ణీత ధ్రువపత్రాలతో దరఖాస్తును కళాశాలలో అందజేయాలని కోరారు. 19వ తేదీ ఉదయం ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నందిగామలో తాగునీటికి కటకట

- నిరవధిక సమ్మెలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు..
- తాగునీరు అందక అవస్థలో పట్టణ ప్రజలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ పాలకులు
- కొరవడిన ప్రత్యామ్నాయ చర్యలు



పట్టణంలోని వాటర్ ట్యాంకుల వద్ద తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు





వాటర్ ట్యాంకుల వద్ద క్యాన్లలో నీటిని పట్టుకుని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న స్థానికులు

నందిగామ రూరల్: నందిగామ పట్టణ ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో నీటిసరఫరా నిలిచిపోయింది. దీంతో పట్టణ ప్రజలు సరిపడినమేర తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ అదికూడా అరకొరగానే సాగుతుండటంతో ఆయా కాలనీవాసులకు తాగునీరు అందడం లేదు. ముఖ్యంగా పట్టణంలోని డీవీఆర్ కాలనీ, ముక్కపాటినగర్, రైతుపేట, పాత బస్టాండ్, బాబు జగ్జీవన్‌రామ్ భవన్ ఎదురు రోడ్డు తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. పలుకుబడి కలిగినవారు ఫోన్ చేయగానే ట్యాంకర్ వస్తోందని, సామాన్యులను మాత్రం మున్సిపల్ పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు పట్టణ వాసుల నుంచి వినిపిస్తున్నాయి.

సమ్మెతో నీటిసరఫరాకు అంతరాయం..

కనీస వేతనాలు అందించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా కల్పించడంతోపాటు తమతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవటంతో ఈనెల 13వతేదీ నుంచి పూర్తిస్థాయి సమ్మెకు దిగారు. దీంతో పట్టణంలోని 20 వార్డులలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అరకొరగా నీటిసరఫరా..

పట్టణంలోని అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. పది ట్యాంకర్ల పట్టణంలోని 20వార్డులకు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్న పాలకుల వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

నీటిని తెచ్చుకుంటున్న జనం..

ప్రస్తుతం అందుబాటులో సిబ్బందితో ప్రాధాన్యతాక్రమంలో తాగునీటిని కొళాయిల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవేమి సాధ్యపడటం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు పట్టణంలోని రహదారి బంగ్లా వద్దనున్న ట్యాంకుల వద్దకు వచ్చి ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై క్యాన్‌లలో నీటిని పట్టుకుని తీసుకెళ్తున్నారు. మరికొందరు మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. ఇకనైనా మున్సిపల్ పాలకులు స్పందించి పట్టణంలో తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. నీటిసరఫరా నిలిచిపోయి పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'దినపత్రిక మున్సిపల్ ఏఈ ఫణిశ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఫోన్‌ద్వారా ఆయనను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.



తాగునీటికి ఇబ్బందిగా ఉంది

నాలుగైదు రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిగా ఉంది. మా కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని రహదారి బంగ్లా వద్దనున్న వాటర్ ట్యాంకుల వద్దకు వచ్చి క్యాన్లలో నీటిని పట్టుకుని తెచ్చుకుంటున్నాం.

– పుష్ప, ఉమా కాలనీ



ట్యాంకర్ల సంఖ్య పెంచాలి

మున్సిపల్ కార్మికుల సమ్మెతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ అధికారులు ట్యాంకర్‌లతో నీటిని సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో చాలటం లేదు. చేసేది లేక ట్యాంకుల వద్దకు వచ్చి క్యాన్‌లలో పట్టుకుని తీసుకెళ్తున్నాం. అధికారులు స్పందించి సమ్మె ముగిసేంత వరకు ట్యాంకర్ల సంఖ్యను పెంచి తాగునీటిని సరఫరా చేయాలి.

– షేక్ సుభాని, పాతబస్టాండ్



సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుంది. దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి పోరాటమే ఆయుధంగా చేసుకుని ముందుకు సాగుతాం. కార్మికుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చే వరకు పోరాటం నుంచి వెనక్కు తగ్గేది లేదు.

– కటారపు గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

విద్యార్థులకు అవగాహన



గనిఆత్కూరు(కంచికచర్ల): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని శక్తి టీం కోఆర్డినేటర్, ఏఎస్ఐ బంటు హనుమయ్య సూచించారు. గనిఆత్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఏదైనా సమస్య వస్తే తద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల బారినపడకుండా, కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఓంకార్‌బాబు, శక్తి టీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

నందిగామరూరల్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతోపాటు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఎస్ఐ అభిమన్యు సూచించారు. ఏసీపీ తిలక్ ఆదేశాల మేరకు స్థానిక చైతన్య కళాశాల విద్యార్థినులకు మహిళల భద్రత, శక్తి యాప్ వాడకం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల తక్షణ సహాయానికి ఎస్ఓఎస్ యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల కారణంగా జరిగే అనర్థాలపై కలిగి ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దర్శనాల'కు ఘనసత్కారం



దర్శనాల వెంకటరమణను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేర్‌మహ్మద్‌పేటకు చెందిన దర్శనాల వెంకటరమణ బుధవారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ఆపార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తన్నీరు, దర్శనాల వెంకటరమణను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. అనంతరం దర్శనాల వెంకటరమణ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, బూడిద నరసింహారావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, నాయకులు పాతకోటి ఉదయభాను, అన్నెపాగ మురళి, పిడమర్తి ప్రభు, షేక్ షావుద్దీన్, పి.బ్రహ్మనాయుడు, పింగళి నర్సింహారెడ్డి, కాకనబోయిన నాగరాజు, గడ్డం రామకృష్ణ, మోరె దుర్గాప్రసాద్, సుధాకర్, షేక్ దాదాసాహెబ్, మన్నె అప్పారావు, గొట్టిపాళ్ల సురేష్, వేల్పుల విజయ్, షేక్ వలి, సీతారాములు, తిరుపతిరావు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం

నందిగామటౌన్: 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ రప్పారప్పా అంటూ చెప్పిన సినిమా డైలాగ్‌ను వక్రీకరిస్తూ టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ నాదెండ్ల నరేంద్ర బుధవారం పేర్కొన్నారు. టీడీపీ నేతలు ఇష్టారీతిన మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినా నందిగామలో మీరే గెలవాలన్నా అంటూ ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు చెప్పిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సజ్జా అజయ్, నేడు తిరిగి ఆయననే విమర్శిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఆయన ఎన్నిసార్లు అరుణకుమార్‌ను కలిశారో..ఎన్నిసార్లు టీడీపీని విమర్శించారో నియోజకవర్గం మొత్తం తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ గుర్తుపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ ఆశీస్సులతో కౌన్సిలర్లుగా గెలిచి తమ స్వార్థరాజకీయాల కోసం పార్టీ ఫిరాయించినవారు కూడా ఇష్టారీతిన మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. ఇకనైనా అటువంటి చౌకబారు వ్యాఖ్యలు, అసత్యప్రచారాలు మానుకోవాలని సూచించారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన



మోటార్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): మండలంలోని పాలేటి ఒడ్డునున్న ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతేడాది పాలేటికి వచ్చిన వరదల కారణంగా ఎత్తిపోతల పథకం మోటార్లు, పైప్‌లైన్ కొట్టుకుపోయాయని మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి రైతుల వ్యవసాయ భూములకు సాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆయన అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని కాచవరం సప్లయ్ చానల్‌ను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కానూరి కిషోర్, కస్సుర్తి శ్రీనివాసరావు, యానాల గోపి, గింజుపల్లి కృష్ణ, నాగుల్‌మీరా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ పరిశీలన..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఊర చెరువు ప్రధాన కాలువ అయిన ఎర్రకాలువను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం పరిశీలించారు. ఎర్రకాలువలో గుర్రపు డెక్క, వ్యర్థాలు పేరుకుపోయి పూడిక ఏర్పడటంతో చెరువు అయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందడం లేదంటూ రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే వివరించారు. అదేవిధంగా పట్టణంలోని శాంతినగర్ వద్ద బుడపర్తి వాగును, ఎర్రకాలువ కట్టను ఎమ్మెల్యే తాతయ్య పరిశీలించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాచవరం కెనాల్ చైర్మన్ కానూరి కిషోర్, నీటి సంఘం మాజీ చైర్మన్ యానాల గోపీచంద్, గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీడియేషన్ కేంద్రంతో సత్వరన్యాయం



ర్యాలీలో పాల్గొన్న జడ్జి షేక్ రియాజ్, న్యాయవాదులు

నందిగామటౌన్: కక్షిదారులకు సత్వర న్యాయం చేసేందుకే మీడియేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మీడియేషన్ కేంద్రంపై అవగాహన కల్పించేందుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ఆవరణ నుంచి 1కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రియాజ్ మాట్లాడుతూ ఆయా కేసుల్లోని ఇరువర్గాలను పిలిచి సరైన రీతిలో వివరించి రాజీమార్గం ద్వారా కేసును పరిష్కరించుకునేందుకు మీడియేషన్ కేంద్రం ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కక్షిదారులు కూడా గమనించి, మీడియేషన్ కేంద్రం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే మేలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, మట్టా ప్రసాద్, షేక్ సైదా, నంద్రు శ్రీరామ్మూర్తి, కొమ్మినేని మాలేశ్వరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బైకు ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడలోని విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 124 కేసులకు గాను రూ.4.08 లక్షలు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సర్కిల్ సూపరింటెండెంట్ విజయకృష్ణ, గుణదల డీఈ పి.హరిబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి : ఎస్ఎఫ్ఐ



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయటంతోపాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులతో కలసి ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికివందనంతోపాటు పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనప్రక్రియను రద్దుచేసి, విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ ఖాజా, నరసింహ, అభిషేక్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన



చెవిలో పువ్వు.. చేతిలో చిప్పతో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వయోపరిమితి 62ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సదుపాయం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా ఇంజినీరింగ్ కార్మికులు బుధవారం గాంధీ సెంటర్‌లో 'చెవిలో పువ్వు.. చేతిలో చిప్ప'తో వినూత్న రీతిలో కూటమి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను చిన్నచూపు చూస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఏడాది కాలంగా కోరుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించటంతోపాటు న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కర్రి వెంకటేశ్వరరావు, వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, తానూరి శ్రావణ్‌కుమార్, దారెల్లి అశోక్ కుమార్, కండెల శ్రీను, మార్కపూడి దాసు, బ్రహ్మం, బాల్, ఆనంద్ ఇందూరి, ప్రమీల, బేబీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..



పేటలో నిరసన దీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేశారు. అందులో భాగంగా సందర్భంగా బుధవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. సీఐటీయూ నాయకులు కోట రవికుమార్, రావెళ్ల శేషు, రైతు సంఘం మండల నాయకులు కె.వెంకటేశ్వరరావు తదితరులు కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవోనంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు, కార్మికులందరికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

గోతులు పూడ్చించరూ...



గుంతలమయమైన పెద్దాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు

వీరులపాడు: రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు గ్రామమైన పెద్దాపురంలోని ఆర్‌అండ్‌బీ రహదారి, జమ్మవరం–పల్లంపల్లి రోడ్డు గోతులమయం కావడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వెల్లంకి రహదారిపై భారీ గుంతలు ఉండటంతో జనం అవస్థలు పడుతున్నారు.

ఆయా గుంతల విషయం తెలియక రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రోడ్లలోని గుంతలను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

• నగదు చెక్కులు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,53,857 విలువ గల నగదు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కార్యాలయంలో బుధవారం బాధిత కుటుంబసభ్యులకు పంపిణీ చేశారు. మొత్తం ఏడుగురికి మంజూరైన నగదు చెక్కులను ఎమ్మెల్యే వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.